
సాక్షి ఒడిశా

గురువారం । 28 । మార్చి । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.5,18,406
బంగారం	1 గ్రాము 150 మిల్లీ గ్రాములు
వెండి	76 గ్రాములు

- భువనేశ్వర్/పూరీ



భక్తిశ్రద్ధలతో దొండనచో దీక్షలు

గంజాం జిల్లాలో ప్రసిద్ధ చైత్రమాస దొండనచో దీక్షలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి.

- 8లో



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సెహరి
గురు	శుక్ర
6.05	4.29

న్యూస్‌రీల్

అదానీ గ్రూప్ చేతికి గోపాల్‌పూర్ పోర్టు



గోపాల్‌పూర్ పోర్టు

బరంపురం: అదానీ గ్రూప్ మరో పోర్టును సొంతం చేసుకుంది. షాపూర్జీ పల్లోంజీ గ్రూప్‌నకు చెందిన గోపాల్‌పూర్ పోర్ట్‌ను అదానీ గ్రూప్ రూ.3,800 కోట్లకు కొనుగోలు చేసింది. ఈ మేరకు అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ లిమిటెడ్‌కు విక్రయించినట్లు షాపూర్జీ పల్లోంజీ గ్రూప్ ప్రకటించింది. తమ కంపెనీ ఆస్తుల నగదీకరణలో భాగంగా పోర్టును విక్రయించినట్లు పేర్కొంది. ఈ పోర్టును 2017లో నిర్మాణంలో ఉన్న దశలో పల్లోంజీ గ్రూప్ కొనుగోలు చేసింది.

బీజేడీకి సుజాత పాలో గుడ్ బై



సుజాత పాలో

రాయగడ: బిజూ మహిళా జనతాదళ్ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షురాలు సుజాత పాలో బీజేడీ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో బీజేడీ ప్రాథమిక సభ్యత్వానికి సైతం రాజీనామా చేస్తున్నట్లు తెలియజేశారు. పార్టీలో ఎటువంటి గుర్తింపు లభించకపోవడంతో తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు అభిప్రాయం వ్యక్తం చేశారు. తన రాజీనామ లేఖను బీజేడీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడితో పాటు రాయగడ జిల్లా బీజేడీ అధ్యక్షుడు సుధీర్ దాస్, రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావులకు పంపించినట్లు వెల్లడించారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న సుబజా బాని ప్రతినిధులు

బరంపురం: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని సుబజా బాని ప్రతినిధులు అన్నారు. నగర శివారు సుకుండాలో ఆసుబజా బాని ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం బుధవారం చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సంస్థ అధ్యక్షుడు శిబరామ్ పాణిగ్రాహి మాట్లాడుతూ మొక్కలు నాటడమే కాకుండా, సంరక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. పచ్చదనం పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని దత్తత తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీడీఏ చైర్మన్ సుభాష్ మహరణ, బీజేడీ నగర అధ్యక్షుడు విజయ్ సామల్, భీష్మాచారి చౌదరి తదితరులు పాల్గొన్నారు.

బస్సు ప్రమాదంలో డ్రైవర్ మృతి



జయపురం: కొరాపుట్–రాయగడ మార్గంలో పొడాగుడ వద్ద మంగళవారం జరిగిన బస్సు ప్రమాదంలో జయపురం ఆటో డ్రైవర్ల అసోసియేషన్ సాధారణ కార్యదర్శి నారాయణ రథ్ దుర్మరణం చెందారు. ఈ ప్రమాదంలో మరో పది మంది తీవ్రంగా గాయపడ్డారు. వారిని రాయగడ, కొరాపుట్ ఆస్పత్రులకు తరలించారు. జయపురం నుంచి కొరాపుట్ మీదుగా వెళ్తున్న ఖండేశ్వర ప్రైవేట్ బస్సు అదుపు తప్పి బోల్తా పడడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో జయపురం ఆటో డ్రైవర్ల అసోసియేషన్ సాధారణ కార్యదర్శి నారాయణ రథ్ దుర్మరణం చెందారన్న సమాచారంతో జయపురం ఆటోడ్రైవర్లు దిగ్భ్రాంతి చెందారు. తమ అసోసియేషన్ కార్యదర్శి మరణం తీరనిలోటని ఆటో డ్రైవర్లు విచారం వ్యక్తం చేస్తున్నారు.

అసంతృప్తి సెగలు

రాయగడ: అత్యంత ప్రతిష్ఠాత్మకమైన రాయగడ శాసనసభ నియోజకవర్గం నుంచి బీజేడీ పార్టీ తరుపున పోటీ చేసేందుకు ఎస్టీసీ చైర్మన్ అనసూయ మాఝికి అధిష్ఠానం టిక్కెట్టు కేటాయించడంపై బీజేడీ శ్రేణులు తీవ్ర వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నాయి. ఈ మేరకు ఒకొక్కరూ తమ రాజీనామా పత్రాలను సంబంధిత నాయకులకు వాట్సాప్‌లో పంపిస్తున్నారు. వీరిలో రాయగడ మున్సిపాలిటీలోని మొత్తం 24 వార్డుల్లో 21 వార్డుల్లో బీజేడీ పార్టీకి చెందిన కౌన్సిలర్లు ఉన్నారు. వీరంతా ఒక్కొక్కరుగా బీజేడీ పార్టీ ప్రాథమిక సభ్యత్వంతో పాటు కౌన్సిలర్ల పదవులకు రాజీనామాలు చేస్తుండడం గమనార్హం. అదేవిధంగా రాయగడ సమితిలోని సమితి సభ్యులు, సర్పంచ్‌లు, మరికొందరు బీజేడీ సీనియర్ నాయకులు సైతం తమ రాజీనామాలను సమర్పిస్తున్నట్లు సమాచారం. గురువారం ఈ మేరకు కౌన్సిలర్‌ల బృందం విలేకర్ల సమావేశాన్ని నిర్వహించి పూర్తి వివరాలను తెలియజేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది.

రేసు గుర్రాలు..!

- బీజేడీ అభ్యర్థుల తొలి రెండు జాబితాలు విడుదల
- 15 లోక్‌సభ, 72 అసెంబ్లీ స్థానాలకు ప్రకటన
- హింజిలికాట్ నుంచే మళ్లీ సీఎం నవీన్ పోటీ





ప్రదీప్ కుమార్ మజ్జి



కౌలస్య హిక్కా



మన్మథ్ రౌత్రాయ్



ప్రణబ్ ప్రకాష్ దాస్



దిలీప్ తిర్కి

Biju Janata Dal

లోక్‌సభ నియోజకవర్గం	అభ్యర్థి
కలహండి	లంబోదర్ నియాల్
సంబల్‌పూర్	ప్రణబ్ ప్రకాష్ దాస్
సుందర్‌గడ్	దిలీప్ టిర్కీ
మయూర్‌భంజ్	సుదామ్ మరాండి
కేంద్రాపడా	అన్షుమాన్ మహంతి
నవరంగ్‌పూర్	ప్రదీప్ కుమార్ మాఝీ
భువనేశ్వర్	మన్మథ్ రౌత్రాయ్
కొరాపుట్	కౌసల్య హికాక
అస్కా	రంజితా సాహు
పూరీ	అరూప్ పట్నాయక్
ఢెంకనాల్	అబినాష్ సామల్
జగత్‌సింగ్‌పూర్	రాజశ్రీ మల్లిక్
కంధమల్	డాక్టర్ అచ్యుత్ సామంత్
కటక్	సంతృప్త మిశ్రా
జాజ్‌పూర్	సర్మిష్ట సెతి



అచ్యుత్ సామంత్



అరూప్ పట్నాయక్



సంతృప్త మిశ్రా



సుదాం మరాండి



రాజశ్రీ మల్లిక్



సర్మిష్ట సెతి



అన్షుమాన్ మహంతి



లంబోధర్ నియాల్



రంజితా సాహు



అబినాష్ సామల్

భువనేశ్వర్: రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం మెల్లగా వేడెక్కుతోంది. ప్రధాన పక్షాలు అభ్యర్థుల జాబితాలు విడతల వారీగా విడుదల చేస్తుండడంతో పోటీ ముఖచిత్రం క్రమంగా స్పష్టమవుతోంది. రాష్ట్రంలో అధికార పక్షం బిజూ జనతా దళ్ అభ్యర్థుల తొలి జాబితాని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ బుధవారం వెల్లడించారు. ఈ జాబితాలో లోక్‌సభకు 9 మంది, శాసనసభకు 72 మంది అభ్యర్థుల పేర్లు ప్రకటించింది.

ఓటమిపాలైన వారికి అవకాశం

బీజేడీ విడుదల చేసిన మొదటి జాబితాలో కొంత మంది ఇదివరకు ఓటమి అభ్యర్థులకు తాజా ఎన్నికల్లో పోటీ చేసేందుకు టికెట్లు కేటాయించడం విశేషం. అలాగే కొత్తగా పార్టీలో చేరినవారికి ఈసారి పోటీకి బీజేడీ నిలబెట్టింది. తొలి జాబితాలో 9 పార్లమెంటరీ నియోజకవర్గాలకు అభ్యర్థులను బీజేడీ ప్రకటించింది. వీరిలో కౌశల్య హికాకా మాత్రమే 2019లో పోటీ చేసి, కాంగ్రెస్‌కు చెందిన సప్తగిరి ఉలాకా చేతిలో 3,613 ఓట్ల స్వల్ప తేడాతో ఓడిపోయారు. మిగిలిన 8 మందిలో దిలీప్ టిర్కీ సుందర్‌గడ్ లోక్‌సభ స్థానం నుంచి 2014 ఎన్నికల్లో బిజూ జనతా దళ్ అభ్యర్థిగా పోటీచేసి, భారతీయ జనతా పార్టీ అభ్యర్థి జుయెల్ ఓరం చేతిలో 18,829 ఓట్ల తేడాతో ఓడిపోయారు. ప్రదీప్ కుమార్ మాఝీ 2009లో కాంగ్రెస్ టికెట్‌పై నవరంగ్‌పూర్ నుంచి లోక్‌సభకు జరిగిన ఎన్నికల్లో గెలిపొందారు. ఆయన 2021లో బిజూ జనతా దళ్‌లో చేరారు. జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) ఒడిశా యూనిట్ అధ్యక్షుడిగా ఉన్న సుదామ్ మరాండి 2014లో బీజేడీలో చేరారు.

పార్టీలో చేరిన కొద్ది గంటల్లోనే...

ప్రత్యక్ష రాజకీయాల్లో ఏమాత్రం అనుభవం లేని సరికొత్త ముఖం మన్మథ్ రౌత్రాయ్‌కు బిజూ జనతా దళ్ టికెట్టు కేటాయించడం విశేషం. ఈయన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, జట్నీ నియోజకవర్గం సిట్టింగ్ ఎమ్మెల్యే సురేష్‌కుమార్ రౌత్రాయ్ కుమారుడు. మన్మథ్ రౌత్రాయ్ బుధవారం ఉదయం బీజేడీలో చేరారు. పార్టీలో చేరిన కొద్ది గంటల్లోనే ఆయనకు టికెట్టు లభించడం నవీన్ వ్యూహానికి సరికొత్త మలుపుగా పరిగణిస్తున్నారు. బీజేడీ అభ్యర్థిగా మన్మథ్ రౌత్రాయ్ భువనేశ్వర్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తారు. ఈ ఎన్నికలో ఆయన సిట్టింగ్ ఎంపీ, భారతీయ జనతా పార్టీ అభ్యర్థి అపరాజిత షడంగితో తలపడాల్సి ఉంది. అపరాజిత దక్షత కలిగిన ఐఏఎస్ అధికారిగా ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగిడి తొలి పోటీలోనే ఘన విజయం సాధించింది. బీజేపీ అగ్రశ్రేణి నాయకుల మన్ననలు పొంది ఈసారి పోటీ చేసేందుకు టికెట్టు సాధించింది. దీంతో అనుభవం లేని మన్మథ్ రౌత్రాయ్ పోరాటం ఎలా ఉంటుంది అనేది ఆసక్తికరంగా మారింది. మరో కొత్త ముఖం అస్కా నుంచి పోటీ చేసేందుకు టిక్కెట్టు పొందిన రంజితా సాహు. ఈమె బీజేడీ నాయకుడు, కొదొలా నోటిఫైడ్ ఏరియా కౌన్సిల్ ఎన్ఏసీ మాజీ చైర్మన్ హర ప్రసాద్ సాహు కుమార్తె. ఈమె తల్లి సునీతాప్రభ సాహు కూడా కొదొలా నోటిఫైడ్ ఏరియా కౌన్సిల్ మాజీ చైర్‌పర్సన్. రంజిత సాహు కవిసూర్యనగర్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో చురుకైన కార్యకర్తగా బీజేడీ అధిష్ఠానం గుర్తింపు సాధించింది. కవిసూర్యనగర్ యువజన సంఘానికి సారథ్యం వహిస్తోంది. బీజేడీ సిట్టింగ్ ఎంపీ అనుభవ్ మహంతిని తొలగించి కేంద్రాపడా లోక్‌సభ నియోజకవర్గం నుంచి అన్షుమాన్ మహంతీని బీజేడీ బరిలోకి దింపింది.

రెండో జాబితాలో 6 ఎంపీ స్థానాల ప్రకటన

బీజేడీ లోక్‌సభ అభ్యర్థుల తొలి దశ జాబితాను ప్రకటించిన కొన్ని గంటల తర్వాత ఆ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ బుధవారం సాయంత్రం మరో ఆరు లోక్‌సభ నియోజకవర్గాల పేర్లను ప్రకటించారు. లోక్‌సభ ఎన్నికలకు రెండో దశ అభ్యర్థుల జాబితా ప్రకటనపై మీ ఆశీస్సులు కోరుతున్నాను అని అభ్యర్థుల పేర్లను ప్రకటించిన సందర్భంగా నవీన్ పట్నాయక్ అభ్యర్థించారు. ఆయన ప్రకటించిన ప్రకారం 2019లో భువనేశ్వర్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసి విఫలమైన అరూప్ పట్నాయక్ ఈసారి పూరీ నుంచి పోటీ చేయనున్నారు. సిట్టింగ్ ఎంపీ మహేష్ సాహు స్థానంలో అబినాస్ సామల్ కొత్త ముఖంగా ఢెంకనాల్ నుంచి పోటీ చేయనున్నారు. కార్పొరేట్ ఉద్యోగాన్ని వదిలిపెట్టి ఇటీవల పార్టీలో చేరిన సంతృప్త మిశ్రాకు కటక్ లోక్‌సభ స్థానం టిక్కెట్ ఇవ్వగా, సిట్టింగ్ ఎంపీ రాజశ్రీ మల్లిక్ మళ్లీ జగత్‌సింగ్‌పూర్ నుంచి పోటీ చేయనున్నారు. కంధమల్ లోక్‌సభ స్థానం నుంచి సిట్టింగ్ ఎంపీ డాక్టర్ అచ్యుత్ సామంత్ మళ్లీ అదే సెగ్మెంట్ నుంచి బరిలోకి దిగుతారు. సర్మిష్ట సెతి మళ్లీ జాజ్‌పూర్ పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు పార్టీ అధిష్ఠానం టికెట్టు కేటాయించింది.

ఎమ్మెల్యే అభ్యర్థులు వీరే..

తొలి జాబితాలో 72 నియోజకవర్గాలకు ఖరారు చేసిన అభ్యర్థుల పేర్లను ముఖ్యమంత్రి, బీజేడీ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ ప్రకటించారు. ఈ 72 మంది అభ్యర్థుల్లో నవీన్ పట్నాయక్ ఒకరు. ఈ జాబితాలో 18 శాతం, 13 మంది కొత్త ముఖాలు ఉన్నాయి. గంజాం జిల్లా హింజిలికాట్ శాసనసభ నియోజకవర్గం నుంచి నవీన్ పట్నాయక్ మళ్లీ పోటీ చేయనున్నారు. ఒడిశాలో మే 13, 20, 25, జూన్ 1 తేదీల్లో నాలుగు దశల్లో పోలింగ్ జరగనుంది.

అభ్యర్థుల మార్పిడి

బీజేడీ విడుదల చేసిన తొలి జాబితాలో కొన్ని స్థానాల్లో అభ్యర్థులను మార్చి సీట్ల కేటాయింపులో సంస్కరణలు చేపట్టారు. ఈ వర్గంలో భద్రక్, భండారిపొఖొరి, బ్రహ్మగిరి, సత్యబాది నియోజకవర్గాలు ఉన్నాయి. పశ్చిమ ఒడిశా బొలంగీర్ నుంచి మాజీ ఎంపీ కలికేష్ నారాయణ్ సింగ్ దేవ్‌ను ఈసారి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బీజేడీ బరిలోకి దింపింది. 2009, 2014లో బొలంగీర్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి కలికేష్ ఎన్నికయ్యారు. గత 2019 లోక్‌సభ ఎన్నికల్లో బొలంగీర్‌లో బీజేపీ అభ్యర్థి సంగీతా కుమారి సింగ్‌దేవ్ చేతిలో ఓడిపోయారు. గత ఎన్నికల్లో ఈయన సోదరుడు అర్కేష్ నారాయణ్ సింగ్ దేవ్ బిజూ జనతా దళ్ టికెట్‌తో గత 2019 సార్వత్రిక ఎన్నికల్లో బొలంగీర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీచేసి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నరసింగ మిశ్రా చేతిలో అర్కేష్ ఓడిపోయాడు.

శాసనసభ	అభ్యర్థి	శాసనసభ	అభ్యర్థి
బిసంకటక్	జగన్నాథ్ సరకా	జి.ఉదయగిరి	సలుగా ప్రధాన్
గుణుపురం	రఘునాథ్ గొమాంగో	కొంటమల్	మహీధర్ రాణా
రాయగడ	అనుసయ మాఝీ	బౌధ్	ప్రదీప్ కుమార్ ఆమత్
బర్‌గడ్	దేబేష్ ఆచార్య	బొడొంబా	దేబీ ప్రసాద్ మిశ్రా
బిజేపూర్	రీతా సాహు	బంకీ	దేబీ త్రిపాఠి
అట్టబిరా	స్నేహాంగిని చురియా	అఠాగొడొ	రణేంద్ర ప్రతాప్ స్వంయి
భట్లీ	సుశాంత్ సింగ్	కటక్ చౌద్వార్	సౌవిక్ బిస్వాల్
జలేశ్వర్	అశ్విని పాత్రో	నియాలీ	ప్రమోద్ మల్లిక్
బొస్తా	సుభాషిణి జెనా	కటక్ సదర్	చంద్ర సారథి బెహెరా
భండారిపొఖొరి	సంజీబ్ మల్లిక్	పటకురా	అరవింద్ మహాపాత్రో
భద్రక్	ప్రఫుల్ల సామల్	బెౌల్	ప్రతాప్ కేశరి దేవ్
బాసుదేవ్‌పూర్	బిష్ణుబ్రత రౌత్రాయ్	రాజ్‌నగర్	ధ్రువ సాహు
ధామ్‌నగర్	డాక్టర్ సంజయ్ దాస్	మహాకలపడా	అతున్ సబ్యసాచి నాయక్
చాంద్‌బాలి	బ్యోమకేష్ రే	పూరీ	సునీల్ మహంతి
బింఝార్‌పూర్	ప్రమీలా మల్లిక్	బ్రహ్మగిరి	ఉమా సామంత్రయ్
ధర్మశాల	ప్రణబ్ బలబంత్రాయ్	సత్యబాది	సంజయ్ దాస్ బర్మా
జాజ్‌పూర్	సుజాతా సాహు	పిప్పిలి	రుద్ర మహారథి
సుకింద	ప్రీతిరంజన్ ఘొడై	జట్నీ	బిభూతి భూషణ్ బలబంత్రాయ్
ఢెంకనాల్	సుధీర్ కుమార్ సామల్		
కామాఖ్యనగర్	ప్రఫుల్ల మల్లిక్	రొణొపూర్	సత్య ప్రధాన్
పర్‌జంగ్	నృసింహ సాహు	దసపల్లా	రమేష్ బెహెరా
పల్లొలొహడా	ముఖేష్ పాల్	నయాగడ్	డాక్టర్ అరుణ్ కుమార్ సాహు
ఛెండీపాదా	సుశాంత్ కుమార్ బెహెరా		
సోన్‌పూర్	నిరంజన్ పూజారి	భంజనగర్	బిక్రమ్ కేశరి అరూఖ్
లొయిసింగా	నిహార్ బెహెరా	పొలొసారా	శ్రీకాంత్ సాహు
పట్నాగడ్	సరోజ్ మెహెర్	కవిసూర్యనగర్	లతికా ప్రధాన్
బొలంగీర్	కలికేష్ నారాయణ సింగ్ దేవ్	ఛత్రపురం	సుభాష్ బెహెరా
టిట్లాగడ్	టుకుని సాహు	సొరొడా	సంఘమిత్ర స్వంయి
నువాపడా	రాజేంద్ర ధొలొఖియా	హింజిలికాటు	నవీన్ పట్నాయక్
ఉమర్‌కోట్	నబీనా నాయక్	గోపాల్‌పూర్	బిక్రమ్ పండా
ఝొరిగాంవ్	రమేష్ మాఝీ	దిగొపొహండి	బిప్లబ్ పాత్రో
నవరంగ్‌పూర్	కౌశల్య ప్రధాని	చికిటి	చిన్మయానంద స్వరూప్ దేవ్
డాబుగాంవ్	మనోహర్ రంధారి	కోట్‌పాడ్	చంద్రశేఖర్ మాఝీ
లంజిగడ్	ప్రదీప్ దిషారి	కొరాపుట్	రఘురామ్ పడాలు
జునాగడ్	దివ్య శంకర్ మిశ్రా	మల్కన్‌గిరి	మానస్ మద్కామి
ధర్మగడ్	పుష్పేంద్ర సింగ్‌దేవ్	ఘసిపురా	బద్రీ నారాయణ పాత్రో
భవానీపట్న	లతికా నాయక్	పట్నగొడొ	జగన్నాథ్ నాయక్

వారసులొచ్చారు..!

భువనేశ్వర్: సార్వత్రిక ఎన్నికలు–2024 పురస్కరించుకుని బిజూ జనతా దళ్ విడుదల చేసిన తొలి జాబితాలో వారసత్వానికి ప్రాధాన్యత కల్పించింది. మరోవైపు ప్రాబల్యం ఉన్న స్థానాల నుంచి ఇరుగుపొరుగు నియోజకవర్గాలకు అభ్యర్థులను మార్చి టికెట్లు కేటాయించింది. దీంతో పలుచోట్ల కొత్త ముఖాలు పోటీకి పరిచయం కానున్నాయి. ఈ వ్యూహంతో సానుభూతి, పరపతిని కూడగట్టుకుని గెలుపే లక్ష్యంగా అభ్యర్థులను బరిలోకి దింపేందుకు సిద్ధమైనట్లు స్పష్టమవుతోంది. ఒక దెబ్బకు రెండు పిట్టలు చందాన నవీన్ వ్యూహం ప్రయోగించారు. దివంగత నాయకుల నియోజకవర్గాల్లో వారి కొడుకులకు టిక్కెట్టు కేటాయించి సానుభూతి అస్త్రం సంధించారు. మరికొన్ని చోట్ల సిట్టింగ్ నాయకుల స్థానాలు మార్చి, పరపతి ప్రయోగంతో ప్రత్యర్థులతో తలపడేందుకు రంగంలోకి దింపారు. దీర్ఘకాలంగా కొనసాగుతున్న సీనియర్ నాయకులను తొలగించి వారి బదులుగా వారసులకు పట్టంగట్టి తొలి జాబితాలో బీజేడీ వారసత్వానికి పీటం వేసింది.

బరిలో మాజీ స్పీకర్ల తనయులు

రాష్ట్ర శాసనసభ మాజీ స్పీకర్ల తనయులకు టిక్కెట్టు కేటాయించి సరికొత్త ముఖాలుగా తాజాగా జరగనున్న ఎన్నికల్లో బీజేడీ పోటీకి నిలిపింది. ఈ వర్గంలో దివంగత స్పీకర్లు మహేశ్వర్ మహంతి, సూర్య నారాయణ్ పాత్రో కుమారులు ఉన్నారు. పూరీ నియోజకవర్గం నుంచి దివంగత మహేశ్వర మహంతి కుమారుడు సునీల్ మహంతి, దివంగత స్పీకర్ సూర్య నారాయణ పాత్రో తనయుడు బిప్లబ్ పాత్రోకు దిగొపొహండి శాసనసభ నియోజకవర్గం టికెట్టు కేటాయించింది. వీరిరువురు సరికొత్త ముఖాలు కావడం విశేషం. దీర్ఘకాలంగా గంజాం జిల్లా చికిటి నియోజకవర్గం నుంచి బిజూ జనతా దళ్ అభ్యర్థిగా కొనసాగుతున్న ఉషాదేవిని తప్పించి ఆమె కుమారుడు చిన్మయానంద దేవ్‌కు టిక్కెట్టు ఇచ్చి ప్రత్యక్ష రాజకీయాలకు తొలి పరిచయం కల్పించారు. ధామ్‌నగర్ నుంచి సంజయ్ దాస్, జాజ్‌పూర్‌కు సుజాతా సాహు, పటకురా నియోజకవర్గం నుంచి అరవింద్ మహాపాత్రో, బొస్తా స్థానం నుంచి సుభాషిణి జెనా కొత్త ముఖాలుగా టికెట్లు సాధించారు.

నియోజకవర్గాల మార్పు

కొన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థులను మార్చారు. 2019 ఎన్నికల్లో భద్రక్ నుంచి గెలిచిన సంజీబ్ కుమార్ మల్లిక్ ఈసారి భండారిపొఖొరి నుంచి పోటీ చేయనున్నారు. భండారిపొఖొరి నుంచి 3 సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ప్రఫుల్ల సామల్‌కు స్థానభ్రంశం కల్పించి భద్రక్ నుంచి బరిలోకి దింపారు. అదేవిధంగా సత్యబాది నుండి సిట్టింగ్ ఎమ్మెల్యే ఉమాకాంత సామంతరాయ్‌ను బ్రహ్మగిరికి మార్చారు. బ్రహ్మగిరి నియోజకవర్గం ప్రస్తుతం బీజేపీ ఖాతాలో ఉంది. గత 2019 ఎన్నికలో సంజయ్ దాస్ బర్మా ఈ స్థానం నుంచి పోటీ చేసి బీజేపీ అభ్యర్థి లలితేందు బిద్యాధర్ మహాపాత్రో చేతిలో 2,000 ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఈ పరిస్థితి పునరావృతం కాకుండా బీజేపీని ఖంగు తినిపించే దృక్పథంతో స్థానభ్రంశం ప్రయోగం రసవత్తరం అవుతుంది.

చైత్రోత్సవాలకు సన్నాహాలు

రాయగడ: పట్టణంలో ఏప్రిల్ 19వ తేదీ నుంచి ప్రారంభమవ్వనున్న మజ్జిగౌరి అమ్మవారి చైత్రోత్సవాల సన్నాహాలు ప్రారంభమయ్యాయి. బుధవారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో చంద్రశేఖర్ పూజారి సమక్షంలో ముహూర్తపు రాట కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మజ్జిగౌరి అమ్మవారి ఆలయ మేనేజింగ్ ట్రస్టీ రాయిసింగి బిడిక, సభ్యులు ఇప్పిలి సన్యాసిరాజు, దేవేంద్ర బెహర, బాబు దొలాయి. వడ్డాది శ్రీనివాస్‌రావు, మందిరం సిబ్బంది పాల్గొన్నారు. ఉదయం 7 గంటలకు ముహూర్తపు రాట పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ 18వ తేది సాయంత్రం సమీపంలోని జంఝావతి నది నుంచి శుద్ధ జలాలను సాంప్రదాయబద్ధగా తీసుకొచ్చి అమ్మవారి సన్నిధిలో ఉంచుతారు. అనంతరం 19వ తేది తెల్లవారుజామున అమ్మవారి సేవకులు శుద్ధ జలాలతో మందిరం, గర్భగుడి శుభ్రం చేస్తారు.

రూ.12 లక్షలు కేటాయింపు

అమ్మవారి చైత్రోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఈ ఏడాది రూ.12 లక్షల నిధులను కేటాయించడం జరిగిందని మేనేజింగ్ ట్రస్టీ రాయిసింగి బిడిక తెలియజేశారు. ప్రతీ ఏడాదిలాగే ఈసారి కూడా ఉత్సవాలు జరిగే ఐదు రోజులు అమ్మవారికి సూర్యవాహన, చండీ, హోమం తదితర కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ ఉత్సవాల్లో దర్శనార్థం వచ్చే భక్తుల సౌకర్యార్థం తగు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. అయితే ఆదివారం, మంగళవారం, బుధవారాల్లో పొరుగు రాష్ట్రం ఆంధ్ర, ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్ వంటి ప్రాంతాల నుంచి అమ్మవారి దర్శనం కోసం వచ్చే భక్తుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రత్యేకంగా క్యూలైన్లతో పాటు తాగునీరు తదితర సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలియజేశారు.



ముహూర్తపు రాట కార్యక్రమంలో పాల్గొన్న బిడిక, సిబ్బంది తదితరులు

కుమ్మరి శాల నిర్మించాలని విజ్ఞప్తి




సబ్ కలెక్టర్‌ను కలిసిన మహిళలు

జయపురం: సదరు సమితి కుంబారపుట్ గ్రామంలో కుమ్మరి శాల నిర్మించాలని కుంబారపుట్ గ్రామ జై శ్రీరామ్ స్వయం సహాయక గ్రూపు మహిళలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు స్వయం సహాయక గ్రూపు ప్రతినిధులు జయపురం సబ్ కలెక్టర్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కుమ్మరి శాల నిర్మాణానికి 3 ఎకరాల స్థలం కేటాయించాలన్నారు. అలాగే మట్టితో వస్తువులు తయారు చేసేందుకు అవసరమైన యంత్రాలను సమకూర్చాలని విన్నవించారు. తమ గ్రామంలో 400 కుమ్మరి కుటుంబాలు ఉన్నాయని, అయితే మట్టి సమకూర్చుకునేందుకు స్థలం లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. అందువలన తమకు 3 ఎకరాల స్థలం మంజూరు చేయాలన్నారు. గ్రామంలో అన్ని కుటుంబాలు కలిసి మట్టిని సంగ్రహించి కుమ్మరి వృత్తిని చేపడుతున్నట్లు వివరించారు. అలాగే తమ గ్రామంలో నాటుసారా దుకాణంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

సింహం కూనలకు నామకరణం

భువనేశ్వర్: నగర శివారులోని బారంగ్ నందన్ కానన్ జంతు ప్రదర్శనశాలలో ఇటీవల జన్మించిన మూడు ఆసియాటిక్ సింహం కూనలకు పేర్లు పెట్టారు. ఈ మూడు పిల్లలకు అమర్, అక్బర్, ఆంథోనీ అని పీసీసీఎఫ్ నామకరణం చేశారు. గత ఆదివారం ఆసియా సింహం రేవా 3 కూనలకు జన్మనిచ్చిన విషయం తెలిసిందే. తల్లీ, కూనలు ఆరోగ్యంగా ఉన్నాయి. అయితే రేవా కూనలను పట్టించుకోవడం లేదని గుర్తించి, పిల్లలను వేరు చేసి సంతానోత్పత్తి ప్రత్యేక కేంద్రానికి తరలించారు. జంతు వైద్య నిపుణుల ప్రత్యక్ష పర్యవేక్షణలో కూనలను సంరక్షిస్తున్నారు. పుట్టిన సింహం పిల్లల ఆరోగ్యాన్ని పరిశీలించిన అనంతరం వాటిని ఆదివారం ఇంక్యూబేటర్‌లో ఉంచాలని ఒడిశా యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ టెక్నాలజీ (ఓయూఏటీ) ప్రొఫెసర్ ఇంద్రమణినాథ్ సూచించారు. గర్భం దాల్చిన 108 రోజులలో సింహం రేవా (7) మూడు కూనలకు జన్మనిచ్చింది.



ప్రత్యేక సంరక్షణ శిబిరంలో సింహం కూనలు

క్లుప్తంగా

రైస్‌మిల్లులో చోరీ

కోటబొమ్మాళి : మండల కేంద్రంలోని కోటబొమ్మాళి సంతోషిమాత గుడి వద్ద సూర్యరత్న రైస్‌మిల్లులో మంగళవారం అర్ధరాత్రి దొంగలు చొరబడ్డారని మిల్లు యజమాని సకలాభక్తుల వైకుంఠరావు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దొంగలు ప్రహరీని దూకి వాచ్‌మేన్‌ను కత్తులతో భయపెట్టి మిల్లులోకి చొరబడి రూ.3వేలు నగదు, కొన్ని వస్తువులు దోచుకుపోయారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దొంగలు సీసీ కెమెరా సెటాప్ బాక్సును పట్టుకుపోయారని, విచారణ చేస్తున్నామని ఎస్‌ఐ మహమ్మద్ అలీ తెలిపారు. ఇదే రైస్‌మిల్లులో నెలరోజుల కిందట దొంగలు చొరబడి రూ.40 వేలు నగదు ఎత్తుకుపోయారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

టెక్కలి రూరల్: మండలంలోని లచ్చన్నపేట సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. పలాస నుంచి టెక్కలికి ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తులు కారులో వస్తుండగా లచ్చన్నపేట వద్ద వారి ముందు వెలుతున్న టిప్పర్ ఒక్కసారిగా మలుపు తిప్పడంతో ఢీకొట్టారు. ఈ ఘటనలో కారు కొంతవరకు పాడైపోగా లోపల ఉన్న చిన్నారితో పాటు భార్యాభర్తలు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఈ ఘటనపై టెక్కలి పోలీసులకు సమాచారం అందించారు.

పోగొట్టుకున్న బ్యాగు తిరిగొచ్చింది


బాధితునికి ఆటో డ్రైవర్ ద్వారా బ్యాగు, వెండిపళ్లెం అప్పగిస్తున్న సీఐ

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలో ఓ వ్యక్తి ఆటోలో బ్యాగు మరిచి ఇంటికి వెళ్లిపోయాడు. తీరా బ్యాగు పోగొట్టుకున్నానని తెలుసుకున్నాక రెండో పట్టణ పోలీసులను ఆశ్రయించగా వారు కనిపెట్టి బాధితునికి బ్యాగు ఇప్పించారు. సీఐ గుండుమోను ఉమామహేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు.. ఈ నెల 24న ఉదయం నగరానికి చెందిన చిరువ్యాపారి మల్లా సంతోష్‌కుమార్ కుటుంబంతో కలిసి నిశ్చితార్థ శుభకార్యం నిమిత్తం విశాఖపట్నం బయల్దేరాడు. ఆర్టీసీ కాంప్లెక్సులో బస్సు ఎక్కేందుకు గాంధీపార్కు వద్ద ఆటో ఎక్కాడు. దిగేటప్పుడు బ్యాగు మరిచి వెళ్లిపోయాడు. అందులో రూ. 20 వేలు విలువైన వెండి పళ్లెం, కొత్త దుస్తులు ఉన్నాయి. తీరా ఫంక్షన్‌కు వెళ్లి చూశాక లేకపోవడంతో అటు నుంచి వచ్చి పోలీస్ స్టేషన్‌లో అదే రోజు రాత్రి ఫిర్యాదు చేశాడు. పోలీసులు సంతోష్‌కుమార్ ఆటో ఎక్కిన, దిగే సమయాన్ని బట్టి సీసీ ఫుటేజీ పరిశీలించారు. ఆటో రిజిస్ట్రేషన్ నంబరును తెలుసుకుని విచారించగా కిష్టప్పపేటకు చెందిన పి.రామారావు ఆటో అని గుర్తించారు. దీంతో బుధవారం రామారావును రప్పించి బ్యాగును బాధితుడు సంతోష్‌కుమార్‌కు సీఐ అప్పగించారు.

స్థల వివాదంపై కేసు నమోదు

రణస్థలం : మండలంలోని వెల్బురాయి గ్రామంలో మూడు సెంట్లు స్థల వివాదం ఇరువర్గాల మధ్య కొట్లాటకు దారితీసింది. జె.ఆర్.పురం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దేబారికి నర్సింహులు, దేబారికి రాము మాస్టారు కుటుంబాల మధ్య కొన్నేళ్లుగా స్థల వివాదం జరుగుతోంది. దీనిపై పలుమార్లు రెవెన్యూ అధికారులు, పోలీసులు వచ్చి ఇరువర్గాలకు సర్దిచెప్పారు. ఈ క్రమంలో ఈ నెల 25న ఇరువర్గాల మధ్య కొట్లాట జరగడంతో ఒక వర్గానికి చెందిన దేబారికి రాధ, మరో వర్గానికి చెందిన దేబారికి నర్సింహులు, ఉగాదిలు గాయపడి శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై జె.ఆర్.పురం ఎస్సై కె.గోవిందరావు ఇరువర్గీయులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెజ్లింగ్ క్రీడాకారుడికి రజతం


శివచరణ్‌ను అభినందిస్తున్న కళాశాల ప్రతినిధులు

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెం శ్రీశివానీ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన రెజ్లింగ్ క్రీడాకారుడు శివచరణ్ ఈ నెల 21, 22 తేదీల్లో చిత్తూరులో జరిగిన రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో రజత పతకం సాధించాడు. 72 కిలోలు విభాగంలో సత్తాచాటి ద్వితీయ స్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా శివచరణ్‌ను బుధవారం కళాశాలలో ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు, మేనేజ్‌మెంట్ సభ్యులు పి.దుర్గాప్రసాద్‌రాజు, అధికారులు, ఫ్యాకల్టీ సభ్యులు ప్రత్యేకంగా అభినందించారు. జాతీయ స్థాయిలోనూ రాణించాలని ఆకాంక్షించారు.

పెయింటర్‌కు గాయాలు

టెక్కలి రూరల్ : టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలోని సత్యసాయి నగర్‌లో ఇటీవల నిర్మాణం చేపట్టిన నాలుగు అంతస్తుల బిల్డింగ్‌కు రంగులు వేస్తుండగా పరంజీ విరిగిపోవడంతో టెక్కలి ఆదిఆంధ్ర వీధికి చెందిన కిర్రి జగన్నాథం కిందపడి గాయాలపాలయ్యాడు. తలకు బలమైన గాయం తగలడంతో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు.

భక్తిశ్రద్ధలతో దొండనచో దీక్షలు

గంజాం జిల్లాలో ప్రసిద్ధ చైత్రమాస దొండనచో దీక్షలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. నగరంలోని గాంధీ నగర్, హరడాఖండి, సిటీ హాస్పిటల్ రోడ్డు, పాడు వీధుల్లో దొండనచో దీక్షాదారుల ప్రదర్శనలు జరిగాయి. సంప్రదాయం ప్రకారం మిట్ట మధ్యాహ్నం ఎండలో కఠోర ప్రదర్శనలు చేపట్టారు. ఉపవాసాలతో ఉన్న దీక్షాధారులు సాయంత్రం స్నానం చేసిన అనంతరం ప్రసాద సేవనం చేస్తున్నారు. రాత్రి దొండకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం, వివిధ రకాల సాంస్కృతిక నాటికల ప్రదర్శనలతో స్థానికులకు అకట్టుకుంటున్నారు.

– బరంపురం






ఆటో డ్రైవర్ల అసోసియేషన్ రాస్తారోకో


ర్యాలీ నిర్వహిస్తున్న ఆటో డ్రైవర్ అసోసియేషన్ సభ్యులు

బరంపురం:

కొరాపుట్–రాయగడ మార్గంలోని పాడాగుడ వద్ద ప్రైవేటు బస్సు బోల్తాపడిన ఘటనలో జయపురం ఆటో డ్రైవర్ల అసోసియేషన్ కార్యదర్శి నారాయణ రథ్ మరణించిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై అసోసియేషన్ సభ్యులు తీవ్రంగా స్పందించారు. బుధవారం నారాయణ రథ్ మృతదేహం తీసుకొస్తున్న అంబులెన్స్‌ను ఆటో డ్రైవర్లు అడ్డగించి రాస్తారోకో నిర్వహించారు. మృతుడిది నిరుపేద కుటుంబమని, ముగ్గురు ఆడపిల్లలు కలిగిన ఆ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. దీని కోసం అతడి కుటుంబానికి తగిన పరిహారం చెల్లించాలన్నారు. రాస్తారోకోతో 26వ నంబర్ జాతీయ రహదారికి ఇరువైపుల వాహనాలు నిలిచిపోయాయి. దీంతో జయపురం పట్టణ పోలీసు అధికారి వచ్చి ఆందోళనకారులతో చర్చించారు. మృతుని కుటుంబానికి తగు న్యాయం చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.


రోడ్డుపై నిరసన తెలుపుతున్న ఆటో డ్రైవర్లు


ఆందోళనకారులతో చర్చిస్తున్న పోలీసు అధికారులు

పలాస ప్రాంత ప్రజలకు మల్టీ స్పెషాలిటీ వైద్యం


సాయిశ్రీనివాస మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని ప్రారంభిస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: పలాస ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి సాయి శ్రీనివాస మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటు చేయడం అభినందనీయమని రాష్ట్ర పశుసంవర్థక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలోని రైల్వే గేట్ సమీపంలో పాత జాతీయ రహదారికి అనుకుని ఏర్పాటుచేసిన సాయి శ్రీనివాస మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని బుధవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ టి.బాలకృష్ణ ఆలోచనలు ఉన్నతంగా ఉన్నాయని, మంచి వాతావరణంలో ఆసుపత్రి నిర్మించారని చెప్పారు. ఎం.వి.జ్యోత్స్న ప్రసూతి వైద్యురాలిగా మంచి సేవలు అందిస్తున్నారని, ప్రస్తుతం అన్ని సేవలు ఒకే కాంప్లెక్సులో లభిస్తాయని పేర్కొన్నారు. అనంతరం ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ప్రముఖ వైద్యులు, నాయకులు, తదితరులు హాజరయ్యారు.

జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కిలారి

శ్రీకాకుళం పాతబస్టాండ్ : జిల్లా న్యాయవాదుల బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కిలారి ఈశ్వరరావు ఎన్నికయ్యారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బార్ కార్యాలయంలో జరిగిన ఎన్నికలో ఈశ్వరరావు 241 ఓట్లు, కూన రాజారావు 176 ఓట్లు, ఎన్ని సూర్యారావు 76 ఓట్లు పొందారు. రెండు ఓట్లు చెల్లలేదు. జాయింట్ సెక్రటరీ పోస్టుకు ఇద్దరు పోటీపడగా అందులో పీసా చంద్రశేఖర్ విజయం సాధించారు. మిగిలిన పోస్టులు ఏకగ్రీవం కావడంతో ఎన్నికలు జరగలేదు. ఎన్నికల అధికారిగా కంచరాన నాగభూషణరావు వ్యవహరించారు.

ఘనంగా మదీనాబాబా చందనోత్సవం


అంగరఖాను తీసుకువస్తున్న ముస్లింలు

గార: కళింగపట్నం మదీనాబాబా ఉరుసు చందనోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. రంజాన్ నెలలో నెలవంక ప్రారంభమైన 16 రోజుల తర్వాత బాబాకు ఉరుసు ఉత్సవం నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో హజరత్ మదీనా బాబా దర్గా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు చందనోత్సవం కార్యక్రమం వైభవోపేతంగా నిర్వహించారు. బుధవారం సాయంత్రం బాబా సమాధి ఎదురుగానున్న ప్రార్థనా మందిరం నుంచి చాదర్ (అంగరఖా)ను ఊరేగింపుగా తీసుకువచ్చారు.

బాబా సమాధిపై ఉంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బాబాకు ఉన్న చందనాన్ని తీసి కొత్త చందనం పూశారు. తెల్లటి వస్త్రాన్ని కప్పి ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. బాబాకు ఇష్టమైన అటుకులు ప్రసాదాన్ని సమర్పించారు. పూలతో పూజించి భక్తులు ఉపవాసాలు చెల్లించారు. ఉత్తరాంధ్ర నుంచి అధిక సంఖ్యలో ముస్లింలతో పాటు హిందువులు తరలివచ్చి చందనోత్సవంలో పాల్గొన్నారు.

కమిటీ నివేదికలు బయటపెట్టాలి


రిజిస్ట్రార్ సుజాతకు వినతిపత్రం అందజేస్తున్న దళిత సంఘాల నాయకులు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో పూర్వపు వీసీ నిమ్మ వెంకటరావు అక్రమ నియామకాలు, ఇతర అంశాలపై ఏర్పాటు చేసిన మూడు కమిటీలు నివేదికలు బయట పెట్టాలని దళిత సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు బుధవారం వర్సిటీ పరిపాలన కార్యాలయంలో రిజిస్ట్రార్ పి.సుజాతకు వినతి పత్రం అందజేశారు. కమిటీ నివేదికలను ఎందుకు బహిర్గతం చేయడం లేదని ప్రశ్నించారు. నిబంధనలకు వ్యతిరేకంగా నియమించిన 34 మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని ఎందుకు తొలగించడం లేదన్నారు. నెల రోజుల్లో కమిటీ నివేదికల ఆధారంగా చర్యలు ప్రారంభించకపోతే ప్రత్యక్ష పోరాటం చేస్తామని హెచ్చరించారు. రిజిస్ట్రార్‌ను కలిసిన వారిలో దళిత సంఘాలు నాయకులు మిస్కా కృష్ణయ్య, దుర్గాసి గణేష్, టొంపాల రమణ ఉన్నారు.

క్షేత్ర సహాయకుడు లోకనాథంపై వేటు

శ్రీకాకుళం పాతబస్టాండ్: మందస మండలం తాళ్లగురంటి పంచాయతీకి చెందిన ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకుడు (ఫీల్డ్ అసిస్టెంట్) నల్ల లోకనాథం చౌదరిని విధుల నుంచి తప్పించినట్లు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పథక సంచాలకులు జీవీ చిట్టిరాజు తెలిపారు. లోకనాథం రాజకీయ పార్టీల ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నట్లు ఫిర్యాదు రావడంతో స్వయంగా విచారణ చేపట్టిన పలాస రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ భరత్ నాయక్ దాన్ని ధ్రువీకరించారు. దీంతో ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినట్లు స్పష్టం కావడంతో లోకనాథం చౌదరిని విధుల నుంచి తప్పించినట్లు మంగళవారం విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అమ్మో.. ఎలుగు

పలాస: మామిడిపల్లి గ్రామంలోని సమీప దేవాలయంలో బుధవారం ఓ ఎలుగు పట్టపగలు నిద్రిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది. జీడి తోటలకు వెళ్తున్న రైతులకు ఈ ఎలుగు బంటి తారసపడింది. రైతులు కేకలు వేసినా కనీసం పట్టించుకోకుండా నింపాదిగా లేచి తన భీకర రూపాన్ని చూపి నడుచుకుంటూ వెళ్లింది. దీంతో రైతులు చాలా భయపడ్డారు. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఉద్దానం ప్రజలు కోరుతున్నారు.

'నిబంధనల మేరకే క్రయవిక్రయాలు'

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): జిల్లాలో ఒడిశా సరిహద్దు ప్రాంతాలు, అంతర్‌రాష్ట్ర, అంతర్ జిల్లాల సరిహద్దుల్లో జీఎస్టీ అధికారులు అప్రమత్తంగా ఉండాలని జీఎస్టీ జాయింట్ కమిషనర్ బుడుమూరు నాగార్జునరావు అన్నారు. ఎన్నికల నిబంధనలు పాటించకుండా క్రయవిక్రయాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శ్రీకాకుళం నగరంలో విజయనగరం డివిజన్ ట్రేడ్‌యూనియన్ సభ్యులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో భాగంగా ప్రజలకు తాయిలాలు ఇచ్చేందుకు అధిక మొత్తంలో కొనుగోలు చేసిన వారిపై వ్యాపారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రధానంగా పైడిభీమవరం, ఒడిశా సరిహద్దు ప్రాంతంలో బత్తిలి, మాతల, పాతపట్నం, పురుషోత్తపురంల వద్ద ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్, రాపిడ్ యాక్షన్ టీమ్‌లు ప్రతి రోజూ చెక్‌పోస్టు పాయింట్లను తనిఖీ చేయాలన్నారు. వస్తువుల కొనుగోలు, అమ్మకాలపై సంబంధిత ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ జి.రాణి మోహన్, సిహెచ్.కొండమ్మ, డిప్యూటీ అసిస్టెంట్ కమీషనర్లు ప్రతిభ, చంద్రకళ పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో చిట్‌ఫండ్ మోసగాళ్లు


పోలీసుల అదుపులో కొర, ఆమె సోదరుడు


పోలీసుస్టేషన్ వద్ద చిట్‌ఫండ్ బాధితులు

రాయగడ: స్థానిక రింగ్ రోడ్డు వద్దనున్న తృప్తిరాణి కొర అనే మహిళ, ఆమె సోదరుడు కలిసి చిట్‌ఫండ్ పేరటి సుమారు రూ.2 కోట్లు వసూలు చేసిన అనంతరం బాధితులను మోసగించి పరారైన ఘటనలో నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన సదరు పోలీసులు ఈ మేరకు సోమవారం రాత్రి వారిని అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. అనంతరం వారిని విచారిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న బాధితులు పోలీసుస్టేషన్ వద్దకు చేరుకొని జరిగిన మోసాన్ని పోలీసులకు వివరించారు. అయితే చిట్‌ఫండ్ మోసం ఆరోపణలకు సంబంధించి అదుపులోకి తీసుకున్న తృప్తిరాణి కొర, ఆమె సోదరుడు మాత్రం పెదవి విప్పడం లేదు. బాధితులు ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నప్పటికీ, సొమ్ము వసూలు చేసినట్లుగా ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో పోలీసులు దీనిపై కేసు నమోదు చేయలేదు. అయితే తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

యువకుడి దారుణ హత్య


హత్యకు గురైన కృష్ణ కొండగిరి


సంఘటన స్థలం వద్ద ఎస్డీపీవో సేనాపతి తదితరులు

రాయగడ: పట్టపగలే ఒక యువకుడు దారుణ హత్యకు గురైన ఘటన బుధవారం చోటుచేసుకుంది. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక రామకృష్ణ నగర్ సమీపంలోని మిషన్ కాంపౌడ్ వద్ద చోటు చేసుకున్న ఈ ఘటనలో హత్యకు గురైన వ్యక్తి కృష్ణ కొండగిరి (25)గా పోలీసులు గుర్తించారు. రామకృష్ణ నగర్‌లో నివసిస్తున్న కృష్ణ కొండగిరి అదే కాలనీలో ఉంటున్న అభిరాం జొడియా (25)లు స్నేహితులు. ఇద్దరూ అప్పుడప్పుడూ కలిసి మద్యం సేవిస్తుంటారు. ఈ క్రమంలో బుధవారం ఇద్దరూ మద్యం సేవిస్తున్న సమయంలో ఏదో విషయమై ఘర్షణ పడ్డారు. చిలికిచిలికి గాలివానైన ఇద్దరి వాగ్వివాదం చివరకు హత్యకు దారి తీసింది. ఇద్దరూ ఒకరిపై మరొకరు దాడి చేసుకుంటున్న క్రమంలో కృష్ణ కొండగిరిపై బీరు బాటిల్ సాయంతో అభిరాం దాడిచేసి తీవ్రంగా గాయపరిచాడు. దీంతో కృష్ణ రక్తపు మడుగులో పడి గిలగిలా కొట్టుకుంటూ చివరకు ప్రాణాలు కోల్పోయాడు. అక్కడి వారు పోలీసులను సమాచారం అందించగా ఘటన స్థలానికి ఎస్డీపీవో రస్మీరంజన్ సేనాపతి, ఐఐసీ కమలాకాంత్ కుహరో చేరుకుని రక్తపు మడుగులో ఉన్న వ్యక్తిని ఆస్పత్రికి తరలించగా అప్పటికే అతడు మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఈ కేసు విషయమై దర్యాప్తు చేపట్టిన పోలీసులు హత్య చేసిన అభిరాంను అదుపులోకి తీసుకున్నారు. అసలు వీరిద్దరి మధ్య ఎందుకు గొడవ వచ్చిందనే విషయమై పోలీసులు విచారిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడిని పోలీసులు కోర్టుకు తరలించారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత


స్వాధీనం చేసుకున్న బియ్యంతో అధికారులు

నందిగాం : మండలంలోని కాపుతెంబూరు, దేవుపురం తదితర గ్రామాల నుంచి అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని అధికారులు బుధవారం పట్టుకున్నారు. సివిల్ సప్లయ్ డీటీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో కాపుతెంబూరులో తనిఖీలు చేస్తుండగా అక్రమంగా వ్యాన్‌లో తరలిస్తున్న 953 కిలోల పీడీఎస్ బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. సోంపేటకు చెందిన సానా మనోహర్ పలు గ్రామాల్లో ఈ బియ్యాన్ని కిలో రూ.10 నుంచి రూ.12లకు కొని రూ.20కు అమ్ముకుంటున్నాడని, అక్రమంగా తరలిస్తున్నందున 6ఏ కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేసి నందిగాం పోలీస్ స్టేషన్‌కు తరలించామని, బియ్యాన్ని టెక్కలి ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించామని డీటీ మురళీకృష్ణ తెలిపారు. తనిఖీల్లో ఆర్ఐ కిరణ్, కాపుతెంబూరు వీఆర్వో తారకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అనాథ పిల్లల పేరిట రూ.లక్ష డిపాజిట్


ఫిక్సిడ్ డిపాజిట్ పుస్తకాలను అందజేస్తున్న కలెక్టర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆపదలో ఉన్న వారిని మానవత్వంతో ఆదుకోవడం గొప్ప విషయమని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. ఎచ్చెర్లకు చెందిన కొండేటి శంకరరావు, ఝాన్సీరాణి దంపతులు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో కుమారులు సాయిశరత్, దుర్గాప్రసాద్‌లు అనాథలయ్యారు. వీరిని ఆదుకునేందుకు ఎచ్చెర్ల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది లక్ష రూపాయలు విరాళాలు సేకరించి పోస్టాఫీసులో ఫిక్సిడ్ డిపాజిట్ చేశారు. దీనికి సంబంధించిన బాండ్‌పుస్తకాలను బుధవారం కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు పారుపల్లి శ్రీనివాసరావు సమన్వయకర్తగా వ్యవహరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గట్టు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అప్రమత్తతే ప్రధానం



సూచనలిస్తున్న డీఏహెచ్ఓ మన్మథరావు

సీతంపేట: పశువ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి (డీఏహెచ్ఓ) మన్మథరావు అన్నారు. స్థానిక వెటర్నరీ హాస్పిటల్‌ను బుధవారం సందర్శించారు. పశువైద్యులకు పలు సూచనలిచ్చారు. సీజనల్‌గా వచ్చే వ్యాధులు, వేసిన టీకాలు తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. పశు బీమా లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. కార్యాలయ రిజిస్టర్లు పరిశీలించారు. కార్యక్రమంలో ఏడీ శ్రీనివాసరావు, పొల్ల వెటర్నరీ డాక్టర్ సంతోష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్ఎస్ స్టాక్ పాయింట్ పరిశీలన



గుమ్మలక్ష్మీపురం ఎంఎల్ఎస్ స్టాక్ పాయింట్‌లోని సరకులు పరిశీలిస్తున్న డీఎస్ఓ శివప్రసాద్

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని ఎంఎల్ఎస్ స్టాక్ పాయింట్‌ను సివిల్ సప్లై డీఎస్ఓ శివప్రసాద్ బుధవారం పరిశీలించారు. గోదాములో నిల్వలను చూశారు. బియ్యం, పప్పులు, పంచదార ప్యాకెట్లపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ముద్రలకు స్టిక్కర్లు వేశారా లేదా అన్నది పరిశీలించారు. ఆయన వెంట సూపరింటెండెంట్ ఎం.సాంబశివరాజు ఉన్నారు.

వీఆర్‌పురం పంటపొలాల్లో ఏనుగులు



వీఆర్‌పురం పరిసర ప్రాంతాల్లో ఏనుగుల గుంపు

జియ్యమ్మవలస: మండలంలోని వీఆర్‌పురం, చింతలబెలగాం, గవరమ్మపేట పరిసర ప్రాంతాల్లో ఏనుగులు బుధవారం ఉదయం నుంచి సంచరిస్తూ వరి, జొన్న పంటలను ధ్వంసం చేయడంతో రైతులు లబోదిబో మంటున్నారు. మధ్యాహ్నం సమయంలో అరటితోటలో ధ్వంసం చేస్తూ అక్కడే బస చేయడంతో పంటంతా నేలకొరిగింది. ఏనుగులు చేస్తున్న ఈ విధ్వంసాన్ని రైతులు చూస్తూ నిస్సహాయ స్థితిలో మిన్నకుండిపోయారు. అటవీ సిబ్బంది ఏనుగులను తరలించే ప్రయత్నం చేయాలని రైతులు వేడుకుంటున్నారు.

పోలమాంబ హుండీల ఆదాయం రూ.8,67,949

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి జాతరలో భక్తులు హుండీలలో సమర్పించుకున్న కానుకలను జిల్లా దేవదాయశాఖ అధికారి డి.వి.వి.ప్రసాదరావు ఆధ్వర్యంలో బుధవారం లెక్కించారు. ఈ నెల 2వ తేదీ నుంచి 27వ తేదీ వరకు చదురుగుడిలోని హుండీల నుంచి రూ.6,43,945లు ఆదాయం రాగా, వనంగుడిలోని హుండీల నుంచి రూ. 2,24,004లు వచ్చిందని ఈఓ సూర్యనారాయణ తెలిపారు. 158 గ్రాముల వెండి, 3 గ్రాముల బంగారంను భక్తులు సమర్పించారన్నారు.

లక్ష్యంతో సాగేవారికి ఉజ్వల భవిత



పూర్వ విద్యార్థి, శాస్త్రవేత్త దుర్గాప్రసాద్‌ను సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

చీపురుపల్లిరూరల్(గరివిడి): విద్యార్థి దశలో లక్ష్యంతో ముందుకు సాగేవారికి ఉజ్వల భవిత సొంతమవుతుందని ఎస్‌డీఎస్ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థి, చంద్రయాన్–3 ఉష్ణోగ్రత కొలత యంత్రం రూపకల్పన శాస్త్రవేత్త కరణం దుర్గాప్రసాద్ అన్నారు. గరివిడి కళాశాలలో ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులకు బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థి దశలో నేర్చుకున్న విజ్ఞానపరమైన అంశాలు శాస్త్రవేత్తగా ఎదిగేందుకు దోహదపడ్డాయన్నారు. ఉష్ణోగ్రత కొలత యంత్రాన్ని నింగిలోనికి ఎలా పంపించారు, నింగిలోనికి చేరే వరకు తీసుకున్న ప్రయత్నంలో ఎదుర్కొన్న ఒడిదుడుకులు, అనుభూతిని, విద్యార్థి దశలో ఉన్నత లక్ష్యాల వైపునకు వెళ్లేందుకు తీసుకున్న ప్రణాళిక విధానం, ఆయన తీసుకున్న అవార్డులు, రివార్డులను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం దుర్గాప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు.

సమాజ హితమే లక్ష్యం కావాలి

- కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కట్టిమణి



సెమినార్‌ను ప్రారంభించిన వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ బిపన్‌జోజో

విజయనగరం అర్బన్: యువత చదువుతో పాటు సామాజిక స్పృహను పెంపొందించుకోవాలని తద్వారా సమాజ హితమైన కార్యక్రమాలు చేపట్టి సమాజ శ్రేయస్సు కోసం పనిచేయాలని సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీకట్టిమణి పిలుపునిచ్చారు. ప్రపంచ సోషల్ వర్క్‌డేను పురస్కరించుకుని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలోని సోషల్ వర్క్ విభాగం ఆధ్వర్యంలో 'సోషల్ వర్క్ -ట్రాన్స్‌ఫార్మేషన్ ఆఫ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ అనే అంశంపై బుధవారం జరిగిన సెమినార్‌కు ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజనుల జీవితం చాలా స్వచ్ఛమైనదని వారి అలవాట్లు, ఆచార వ్యవహారాలను అర్థం చేసుకుని వారు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టిపెట్టి అభివృద్ధి పథం వైపు వారిని నడిపించాల్సిన బాధ్యత సోషల్ వర్క్ విద్యార్థులకు ఎంతైనా ఉందన్నారు.

సామాజిక శాస్త్ర అధ్యయనంతో స్పందించే తత్వం

ముఖ్యఅతిథిగా హాజరైన ముంబైకి చెందిన టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ బిపన్‌జోజో మాట్లాడుతూ సామాజిక శాస్త్రాల అధ్యయనం వల్ల యువతలో సమాజంపై స్పందించే తత్వం పెరుగుతుందని సమాజంలో వెనుకబడిన కులాలు, తరగతులు, గిరిజన తెగలు, ఆర్థికంగా వెనుకబడినవారు, స్త్రీలు, దివ్యాంగుల వెనుకబాటుతనాన్ని మెరుగుపరిచి, సామాజిక రుగ్మతలను నిర్మూలించడానికి సోషల్‌వర్క్ ఉపయోగ పడు తుందన్నారు. అనంతరం ముఖ్యఅతిథిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని నిర్వహించిన పోటీల్లో విజేతలకు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ సోషల్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ శరత్‌చంద్రబాబు, డాక్టర్ నగేష్, ఎం.బయోటెక్నాలజీ హెడ్ డాక్టర్ పరికిండ్ల శ్రీదేవి, డాక్టర్ సురేష్ బాబు, డాక్టర్ కె.దివ్య, డాక్టర్ గంగునాయుడు మండల, డాక్టర్ ఇప్పిలి తారకేశ్వరరావు, డాక్టర్ ఎస్‌వీసూర్యనారాయణ, డాక్టర్ మన్నల ప్రసాద్, డాక్టర్ దాసరి నారాయణ, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

భార్యను హత్య చేసిన భర్త అరెస్ట్

జియ్యమ్మవలస: మండలంలోని సింగనాపురం గ్రామానికి చెందిన గంట ముసలినాయుడు తన భార్య అప్పలనరసమ్మను ఈనెల 21వ తేదీన హత్య చేసిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. హత్యకు పాల్పడిన అనంతరం నిందితుడు పరారవగా చినమేరంగి ఎస్సై చిన్నంనాయుడు, సిబ్బందితో కలిసి దర్యాప్తు చేపట్టి మండలంలోని లక్ష్మీపేటలో దుర్గమ్మగుడి వద్ద బుధవారం మధ్యాహ్నం అరెస్ట్ చేశారు. హత్య కోసం ఉపయోగించిన కత్తిని సింగనాపురం వద్ద ఉన్న కాలువ గట్టుపై వెదురు పొదల్లో పడవేసినట్లు నిందితుడు తెలపగా దానిని సీఐ మంగరాజు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు తన భార్యపై అనుమానంతో కత్తితో నరికి హత్యకు పాల్పడినట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు, చినమేరంగి సీఐ బి మంగరాజు, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు. నిందితుడిని పట్టుకోవడంలో కృషిచేసిన సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

యువతా మేలుకో

- ఓటు హక్కు వినియోగించుకో
- ఓటరుగా నమోదుకు ఏప్రిల్ 15 చివరి తేదీ



పార్వతీపురం: సార్వత్రిక ఎన్నికల నగారా మోగింది. ఎన్నికల రోజు ఓటు వేయాలంటే ముందుగా ఓటరుగా నమోదై ఉండాలి. ఓటరుగా నమోదు చేసుకుని ఉన్నా తుది ఓటరు జాబితాలో మీ పేరు లేకుంటే ఓటు వేసేందుకు అనర్హులు. ఇలాంటి వారి కోసమే ఎన్నికల సంఘం చివరి అవకాశం కల్పించింది. తుది ఓటరు జాబితాలో పేరు లేని వారు, ఏప్రిల్ 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన యువతీయువకులు ఓటరుగా నమోదయ్యేందుకు ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించింది. అర్హులైన వారు ఏప్రిల్ 15వ తేదీలోపు ఓటరుగా దరఖాస్తు చేసుకుంటే సంబంధిత అధికారులు దరఖాస్తు వివరాలను పరిశీలించి, అన్ని వివరాలు సక్రమంగా ఉంటే తుది ఓటరు జాబితాలో పేరును చేరుస్తారు.

ఆన్‌లైన్‌లో నమోదు

ముందుగా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎన్‌వీఎస్‌పీ.ఇన్ వెబ్‌సైట్‌లో మీఫోన్ నంబర్‌తో రిజిస్టర్ చేసుకుని లాగిన్ అవ్వాలి. ఆన్‌లైన్ దరఖాస్తులోని వివరాల ఆధారంగా బూత్ స్థాయి అధికారి మీ అడ్రస్‌కు వచ్చి వివరాలను పరిశీలించి, నిర్ధారించుకున్న తరువాత ఓటరు జాబితాలో మీ పేరు చేరుస్తారు. అలాగే హెచ్‌టీటీపీఎస్//ఓటరు పోర్టల్.ఈసీఐ.జీఓవి.ఇన్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి మీ ఫోన్‌నంబర్‌తో రిజిస్టర్ చేసుకోవాలి. లాగిన్ అయ్యాక వెబ్‌సైట్‌లో న్యూ ఓటర్ రిజిస్ట్రేషన్‌లోకి వెళ్లి వివరాలు పొందుపరిస్తే నిర్ధారించిన తరువాత మీపేరు ఓటరు జాబితాలో చేరుస్తారు. మొబైల్ ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ ద్వారా ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

నేరుగా..

18 ఏళ్లు నిండి ఓటరుగా మీకు అర్హత ఉంటే నేరుగా కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. బూత్ లెవెల్ ఆఫీసర్‌కు ఫారం–6 దరఖాస్తు అందజేయవచ్చు. లేదా మండల స్థాయిలో తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులను అందజేయవచ్చు. ఆ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన తరువాత మాత్రమే మీపేరును ఓటరు జాబితాలో చేరుస్తారు. ఓటుహక్కు నమోదుపై ఎలాంటి సందేహాలున్నా టోల్ ఫ్రీ నంబర్ 1950కి ఫోన్‌చేసి నివృత్తి చేసుకోవచ్చు.

ఏటీఎం కార్డు ముద్దాయికి రెండేళ్ల జైలు

విజయనగరం క్రైమ్: ఏటీఎం కార్డ్ మార్చి నగదు కాజేసిన ముద్దాయికి రెండేళ్ల జైలు, రూ.1500 జరిమానా విధిస్తూ విజయనగరం అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ బుధవారం తీర్పు వెల్లడించినట్లు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు తెలిపారు. ఈ కేసు వివరాలిలా ఉన్నాయి. స్థానిక మెయిన్ బ్రాంచ్ సమీపంలోని ఏటీఎం కేంద్రంలో 2022 జనవరి 24న మధ్యాహ్నం మెంటాడ మండలం జయితి గ్రామానికి చెందిన బాధితుడు ధాత్రాజు మల్లిస్వామి నగదు విత్‌డ్రా చేసేందుకు వెళ్లి, అక్కడ గుర్తు తెలియని వ్యక్తి సహాయం తీసుకున్నాడు. ఆ వ్యక్తి మల్లిస్వామి చెప్పిన పిన్ నంబర్‌ను గుర్తు పెట్టుకుని, నగదు విత్‌డ్రా చేసిన అనంతరం అసలు ఏటీఎం కార్డు బదులు వేరే ఏటీఎం కార్డు ఇచ్చి అక్కడినుంచి జారుకున్నాడు. అనంతరం నిందితుడు వేర్వేరు ఏటీఎం సెంటర్లలో ఐదు విడతలుగా రూ.86,750 నగదును కాజేశాడు. ఈ మేరకు బాధితుడు మల్లిస్వామి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేయగా, పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో మోసానికి పాల్పడిన వ్యక్తిని గుంటూరుకు చెందిన కె.విద్యాసాగర్‌గా గుర్తించి అరెస్టు చేసి, కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. కోర్టు ప్రాసిక్యూషన్‌లో నిందితుడిపై నేరారోపణలు రుజువు కావడంతో విజయనగరం అదనపు జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ బి.రమ్య పై విధంగా తీర్పు చెప్పారు.

ప్రహ్లాదరావుకు పదోన్నతి



ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ప్రహ్లాదరావు

విజయనగరం ఫూల్‌బాగ్: జిల్లా అటవీశాఖలో విజయనగరం డిప్యూటీ రేంజ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఎ.ప్రహ్లాదరావుకు శ్రీకాకుళం జిల్లా టెక్కలి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్‌గా పదోన్నతి లభించింది. ఈ మేరకు బుధవారం జిల్లా అటవీశాఖాకార్యాయంలో అటవీ సిబ్బంది ఆయనను సత్కరించారు. డీఎఫ్ఓ ఎస్.వెంకటేష్, ఎఫ్ఆర్ఓ బి. అప్పలరాజు, ఎస్ఎస్ఓ కేవీఎన్ రాజు, ఎఫ్‌బీఓ శ్రీను, రామారావు, తదితరులు ప్రహ్లాదరావును అభినందించారు.

శాంతియుతంగా ఎన్నికల నిర్వహణ

- ఎస్పీ విక్రాంత్ పాటిల్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

పార్వతీపురంటౌన్: శాంతియుతంగా ఎన్నికల నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేశామని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. ఈ మేరకు జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలతో బుధవారం ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులు, మర్డర్, ప్రాపర్టీ, వాహనాల దొంగతనం, 174 సీఆర్‌పీసీ కేసులు, మిస్సింగ్, చీటింగ్ కేసులు, సైబ్ నేరాలు, ఇతర కేసులపై సమీక్షించారు. పోలీస్‌స్టేషన్ల వారీగా పెండింగ్ కేసుల వివరాలు, ప్రస్తుత కేసుల స్థితిగతులు, నమోదైన కేసుల్లో నేరస్తుల అరెస్టు, కేసు దర్యాప్తు తీరుతెన్నులపై సంబంధిత పోలీసు అధికారులను ఆరా తీసి కేసుల ఫైల్స్, రికార్డ్స్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు.

ఎన్నికల నిర్వహణకు ప్రణాళికలు

ఎన్నికలను శాంతియుతంగా జరిపించేలా ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని, అందరం ఇప్పటి నుంచే సిద్ధంగా ఉండాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ పోలీస్ అధికారులకు సమావేశంలో సూచించారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు ముందుగానే సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలను గుర్తించి ఆ ప్రాంతాలను సెక్టార్ల ప్రకారం విభజించి ప్రత్యేక అధికారులను నియమించి, అక్కడ అనుసరించవలసిన కార్యాచరణ గురించి దిశానిర్దేశం చేశారు. సార్వత్రిక ఎన్నికలకు బందోబస్తు విధులు నిర్వహించేందుకు వచ్చిన ఆర్‌పీఎఫ్ ఫోర్స్‌తో జిల్లాలోని పోలీస్ స్టేషన్ల అధికారులు, సిబ్బంది కలిసి వారి లిమిట్స్‌లో గల సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్ గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించాలని సూచించారు.

చెక్‌పోస్టుల్లో తనిఖీలు ముమ్మరం

ఎన్నికల దృష్ట్యా ఏర్పాటు చేసిన సరిహద్దు చెక్ పోస్టుల వద్ద ముమ్మర తనిఖీలు నిర్వహించాలని కోరారు. అధికారులు చెక్‌పోస్టులను సందర్శించి, ఆకస్మిక తనిఖీలు చేస్తూ అక్రమ మద్యం, నగదు తరలింపు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని, 24గంటలు అప్రమత్తంగా ఉంటూ ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని ఆదేశాలు జారీచేశారు. ఎన్నికలకు సమాయత్తమయ్యే సందర్భంలో మద్యం, డబ్బు మాదకద్రవ్యాల రవాణా జరిగే ప్రదేశాలను ముందుగా గుర్తించి ఒక మ్యాపింగ్ తయారు చేయాలని సూచించారు. అనంతరం విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీస్ అధికారులు, సిబ్బందికి ఎస్పీ విక్రాంత్ పాటిల్ ప్రశంసాపత్రాలను అందజేశారు. సమావేశంలో పార్వతీపురం ఏఎస్పీ సునీల్ షరోన్, దిశా డీఎస్పీ ఎస్.ఆర్.హర్షిత, పాలకొండ సబ్ డివిజన్ డీఎస్పీ జీవీ కృష్ణారావు, ఎస్సీ,ఎస్టీ సెల్ డీఎస్పీ జి.మురళీధర్, ఏఆర్ డీఎస్పీ వెంకట అప్పారావు, ట్రైనీ డీఎస్పీ ఎస్.ఎం.డి అజీజ్, ఎస్బీ సీఐ సీహెచ్.లక్ష్మణరావు, డీసీఆర్‌బీ సీఐ బీఎండీ ప్రసాదరావు, ఏఆర్ ఆర్ఐ శ్రీరాములు, శ్రీనివాసరావు, జిల్లా సీఐలు, ఎస్సైలు, ఎ. సూపరింటెండెంట్ కోటేశ్వరరావు, పి.సూపరింటెండెంట్ సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రచారానికి అనుమతి తప్పనిసరి

- రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా

పార్వతీపురం: ఎన్నికల ప్రచారానికి అనుమతి తప్పనిసరి అని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన పార్వతీపురం మన్యం జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎన్నికల నిర్వాహణకు ముందస్తు చేస్తున్న ఏర్పాట్లు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు తీరుపై సమీక్షించారు. సువిధ పోర్టల్‌లో 48 గంటల ముందు ఎన్నికల ప్రచార అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవాలని, లేనిపక్షంలో దరఖాస్తులను నేరుగా స్వీకరించి ఎన్‌కోర్ పోర్టల్‌లో నమోదుచేసి తగిన అనుమతులు జారీ చేయాలని సూచించారు. రాజకీయ ప్రకటనలకు సంబంధించి ఎన్నికల సంఘం మార్గదర్శకాలతోపాటు ఏపీ పురపాలక సంఘం, స్థానిక సంస్థల చట్టాన్ని పరిగణనలోకి తీసుకుని అనుమతులు మంజూరు చేయాలని చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ నిశాంత్‌కుమార్ పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏ పీఓలు సి.విష్ణుచరణ్, కల్పనాకుమారి, జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్.శోభిక, పార్వతీపురం, పాలకొండ, ఆర్‌డీఓలు కె.హేమలత, వీవీ రమణ, ఇన్‌చార్జ్ డీఆర్ఓ జి.కేశవనాయుడు, ఎస్‌డీసీ వి.సూర్యనారాయణ, నోడల్ అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ నిశాంత్ కుమార్

ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద పక్కా ఏర్పాట్లు

గరుగుబిల్లి: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పోలింగ్ ముగిసిన అనంతరం ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద కల్పించాల్సిన వసతులు పక్కాగా ఉండాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గరుగుబిల్లి మండలంలోని డా.వైఎస్ఆర్ ఉద్యాన కళాశాలలో నిర్వహించనున్న ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్.శోభిక, పార్వతీపురం ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్‌లతో కలిసి బుధవారం ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ నిశాంత్‌కుమార్ మాట్లాడుతూ పార్వతీపురం, సాలూరు, కురుపాం, పాలకొండ అసెంబ్లీ నియోజక వర్గాలతో పాటు అరకు పార్లమెంట్ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు ఇక్కడే చేపట్టనున్నందున అవసరమైన చర్యలు పక్కాగా తీసుకోవాలని ఆదేశించారు. పోలింగ్ అనంతరం ప్రతి నియోజకవర్గం ఈవీఎంలను భద్రపరిచేందుకు ఏర్పాటుచేసిన భవనం వద్ద రిసెప్షన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. రిసెప్షన్ కేంద్రంవద్ద అవసరమైన బారికేడ్లను ఏర్పాటు చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా ఈవీఎంలు తరలించేందుకు పటిష్ట బందోబస్తు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తదితర అంశాలపై సూచనలు చేశారు. కార్యక్రమంలో సీతంపేట ఐటీడీఏ పీఓ, పాలకొండ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కల్పనాకుమారి, పార్వతీపురం, పాలకొండ ఆర్‌డీఓలు కె.హేమలత, వీవీ.రమణ, ఇన్‌చార్జ్ డీఆర్ఓ జి. కేశవ నాయుడు, జిల్లా పంచాయతీ రాజ్ అధికారి ఎంవీజీ.కృష్ణాజీ పాల్గొన్నారు.



ఉద్యాన కళాశాలలో ఎన్నికల ఏర్పాట్లపై సూచనలు చేస్తున్న కలెక్టర్ నిశాంత్ కుమార్

పోలింగ్ నిర్వహణలో పీఓ పాత్ర కీలకం



ఎన్నికల ప్రక్రియపై సూచనలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ కార్తీక్

- ఒక్క తప్పు కూడా చేయకూడదు
- కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: ఎన్నికల్లో పీఓల పాత్ర కీలకమని, ఒక్క తప్పుకూడా జరగకుండా చూసుకోవాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి స్పష్టంచేశారు. ఎన్నికల ప్రక్రియ, విధులు, ఈవీఎంలు, వీవీ ప్యాట్ల పనితీరుపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. వివిధ నియోజకవర్గాల నుంచి మాస్టర్ ట్రైనీలుగా ఎంపికైన ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్నికల విధులపై బుధవారం శిక్షణ ఇచ్చారు. ఎన్నికల నిర్వహణ, ఈవీఎంల పనితీరు, పీఓలు, ఏపీఓల విధులు, బాధ్యతలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఎన్నికల కమిషన్ రూపొందించిన వీడియోను ప్రదర్శించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి మాట్లాడుతూ పోలింగ్ రోజున, సంబంధిత పోలింగ్ బూత్‌లో పీఓడే సర్వాధికారమని చెప్పారు. అందరి విధుల పైనా పీఓలకు అవగాహన ఉండాలని సూచించారు. రీ పోలింగ్‌కు ఎక్కడా అవకాశం ఇవ్వకూడదని, ఎట్టి పరిస్థితిలోనూ తప్పులు, పొరపాట్లు జరగకూడదని స్పష్టం చేశారు. వీలైనంత వరకు వేగంగా పోలింగ్ పూర్తి చేయడానికి కృషి చేయాలన్నారు. పీఓలు నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని ఎన్నికల కమిషన్ ఆదేశాలను కచ్చితంగా అమలుచేయాలని ఆదేశించారు. తమ వ్యక్తిగత అభిప్రాయాలను, అభిమానాన్ని ఎక్కడా ప్రదర్శించకూడదని స్పష్టం చేశారు. పోలింగ్‌కు 90 నిముషాల ముందే మాక్ పోల్ నిర్వహించాలని చెప్పారు. హ్యాండ్ బుక్, చేయాల్సిన, చేయకూడని జాబితా, చెక్ లిస్ట్‌లను తమతో పాటు ఉంచుకోవాలన్నారు. ముందు రోజు రాత్రే తప్పనిసరిగా పోలింగ్ కేంద్రానికి చేరుకోవాలని, ఉదయం 5.30 గంటలకే మాక్ పోల్ జరుగుతుంది కాబట్టి, ముందురోజు రాత్రే బూత్‌లో ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. మొత్తం మూడు దశల్లో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, అన్ని అంశాలపైనా సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, అసిస్టెంట్ కలెక్టర్ సహాదిత్ వెంకట త్రివినాగ్, డీఆర్వో ఎస్‌డీ అనిత, నోడల్ అధికారి సుధాకరరావు, ఆర్వోలు ఎం.వి.సూర్యకళ, బి.శాంతి, బి.సాయిశ్రీ నూకరాజు, మురళీకృష్ణ, మున్సిపల్ కమిషనర్ ఎం.మల్లయ్యానాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాలపై పార్టీల రంగులు తొలగించాలి

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలు, భవనాలపై ఉన్న పార్టీల రంగులను తొలగించాలని రిటర్నింగ్ అధికారులను కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. సీ–విజిల్ యాప్‌లో వచ్చే ఫిర్యాదులపై వంద నిముషాల్లోపే చర్యలు తీసుకొని నివేదికలు సమర్పించాలన్నారు. ప్రైవేటు భవనాలపై భవన యజమాని అనుమతి పత్రం సమర్పించి ఏదైనా ఒక పార్టీ జెండా, చిన్నపాటి బ్యానర్ లేదా స్టిక్కర్ ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ సీఈఓ ముఖేష్ కుమార్ మీనా జిల్లా కలెక్టర్లతో బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాలో ఎన్నికల ఏర్పాట్లను కలెక్టర్ వివరించారు.



హాజరైన జిల్లా అధికారులు

ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయం

- గ్రామాల్లో ప్రతి శుక్ర, శనివారాల్లో డ్రైడే కార్యక్రమం
- తాగునీటి నిల్వ కేంద్రాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి
- దోమల నివారణకు ప్రత్యేక డ్రైవ్
- అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్యంపై శ్రద్ధ

పార్వతీపురంటౌన్: దశాబ్దాల కాలంగా వాణిజ్యపరంగా, వ్యాపార పరంగా పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రం పార్వతీపురం వెలుగొందేది. దీనిని గుర్తించిన గత పాలకులు డివిజన్‌గా మార్చారు. అయితే డివిజన్ స్థాయి తప్ప ఎక్కడా అభివృద్ధి దాఖలాలు ఉండేవి కాదు. అభివృద్ధికి నోచుకోని పార్వతీపురం డివిజన్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గుర్తించి పార్వతీపురం మన్యం జిల్లాగా ఏర్పాటు చేసి అభివృద్ధి చేసి ప్రజల మన్ననలను పొందారు. మెరుగైన పారిశుద్ధ్య చర్యల ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించేందుకు రాష్ట్రప్రభుత్వం చర్యలు ముమ్మరం చేసింది. ఈ మేరకు పారిశుద్ధ్యం మెరుగుకు ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తోంది. ప్రజల్లో చైతన్యం నింపడం ద్వారా గ్రామాలు, నివాసిత ప్రాంతాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు అహర్నిశలు కృషిచేస్తోంది. అందులో భాగంగా జిల్లాలోని 452 పంచాయతీల్లో క్రమం తప్పకుండా ప్రతి శుక్ర, శనివారాలు డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహిస్తూ పరిసరాల పరిశుభ్రత, ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించింది. పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్య ఆరోగ్యసిబ్బంది సమన్వయంతో డ్రైడే కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తుండడంతో రాష్ట్రంలోనే ముందంజలో పార్వతీపురం మన్యం జిల్లా పరిశుభ్రమైన జిల్లాగా నిలిచింది.

ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో

గ్రామాల్లో తాగునీటి నిల్వకేంద్రాలైన వాటర్ ట్యాంకుల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యమిస్తూ ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది, గ్రామంలో స్వచ్ఛందంగా వచ్చే వ్యక్తులతో కలిసి నెలకు రెండుసార్లు వాటర్ ట్యాంకులను పరిశుభ్రం చేస్తూ గ్రామంలో ప్రతి ఒక్కరికీ పరిశుభ్రమైన తాగునీటిని అందిస్తూ ప్రజల మన్ననలను పొందుతున్నారు. అకాల వర్షాల కారణంగా కొన్ని గ్రామాల్లో వర్షపు నీటి నిల్వతో అంటు వ్యాధులు ప్రబలకుండా వర్షపు నీటిని దారి మళ్లించేందుకు పంచాయతీ అధికారులు, సిబ్బంది ప్రతి శుక్ర, శనివారాలు క్రమం తప్పకుండా డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహిస్తూ గ్రామాలను పరిశుభ్రం చేస్తూ బ్లీచింగ్, ఫాగింగ్, క్లోరినేషన్ పిచికారీ చేస్తూ గ్రామాల అభివృద్ధికి దోహదపడుతున్నారు.



కేదారిపురం గ్రామంలో చెత్తను సేకరిస్తున్న సిబ్బంది

వైద్య ఆరోగ్యసిబ్బంది ఆధ్వర్యంలో..

గ్రామస్తుల ఆరోగ్యంపై వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు డ్రైడే కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తూ ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నారు. ప్రతి గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించి మందులు, రక్తపరీక్ష కిట్లు ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. వాటిని పర్యవేక్షించడానికి ఒక ఏఎన్ఎంను గ్రామస్తుల కోసం నియమించారు. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో ఓఆర్ఎస్, జింక్ మాత్రలను అందుబాటులో ఉంచారు. జిల్లా స్థాయి అధికారి ప్రతి శుక్ర, శనివారాల్లో గిరిజన గ్రామాలకు వెళ్లి అక్కడి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవాలని ప్రభుత్వం ఆదేశించడంతో గిరిజనులకు గ్రామాల్లోనే మంచి వైద్యసేవలు అందుతున్నాయి.



గుమ్మలక్ష్మీపురంలో వాటర్ ట్యాంకులను పరిశుభ్రం చేస్తున్న సిబ్బంది



సీజనల్ వ్యాధులపై గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది



పార్వతీపురం మండలంలో యాంటీ లార్వా పిచికారీ చేస్తున్న సిబ్బంది